

# పీఎం ఆవాస్ యోజనతో అప్పులపాలు!

- చేతి చమురు వదిలిందన్న 80 శాతం మంది లబ్ధిదారులు
- నిర్ధారించిన ఎల్ఎన్ఎం సర్వే
- పథకంలో అక్రమాలు జరిగాయని వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 13: కేంద్రం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం లబ్ధిదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకం కింద ఇల్లు నిర్మించుకోవడానికి కేంద్రం చాలీచాలని మొత్తం కేటాయించిందని, అవి పూర్తి చేయడానికి అప్పులు చేయాల్సి వచ్చిందని వారు వాపోతున్నారు. పీఎం ఏవై–జి పథకం లబ్ధిదారుల్లో 80 శాతం తమ గృహాల నిర్మాణానికి 1.50 లక్షల రూపాయలకు పైగానే వెచ్చించారు. ఈ పథకం కింద మైదాన ప్రాంతం వారికి రూ.1.20 లక్షలు, పర్వత ప్రాంతాల వారికి రూ.1.30 లక్షలే కేటాయించారు. అయితే చాలాచోట్ల కేటాయించిన మొత్తం కన్నా ఎక్కువగా లబ్ధిదారులకు ఖర్చయినట్టు నేషనల్ లెవెల్ మానిటరింగ్ (ఎన్ఎల్ఎం) అనే స్వతంత్ర సంస్థ ప్రతినిధులు మూడు దశల్లో జరిపిన సర్వేలో నిర్ధారించారు. ఈ గృహాల నిర్మాణానికి లబ్ధిదారులు రూ.1.50 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు ఖర్చు చేసినట్టు ఎన్ఎల్ఎం వెల్లడించింది.

**నిర్మాణంలో ఉన్నా పూర్తయినట్లుగా..**

దేశవ్యాప్తంగా 15 వేల మంది లబ్ధిదారులను ప్రశ్నించిన వీరు తమ సర్వే వివరాలను వెల్లడించారు. 2022లో మూడు దశల్లో ఈ సర్వే జరిపామని చెప్పారు. అలాగే పీఎంఏవై–జీ గురించి వివరించే వెబ్ ఆధారిత వేదిక ఆవాజ్ సాఫ్ట్‌లో పేర్కొన్న విషయాలు చాలావరకు వాస్తవదూరంగా ఉన్నాయని పేర్కొంది. దీనికి సంబంధించిన మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఎంఐఎస్)లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను కూడా పూర్తయినట్టు చూపిస్తున్నారని, అందులోని ఫొటోలు చాలావరకు నకిలీవేనని ఆరోపించింది. జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, బీహార్, ఛత్తీస్‌గఢ్, మణిపూర్, త్రిపుర, కర్ణాటక రాష్ర్టాల్లో ఈ పథకం పేరిట జరిగిన పలు అక్రమాలు తమ దృష్టికి వచ్చాయని ఎన్ఎల్ఎం తన నివేదికలో పేర్కొంది.

## మా ఆదేశాలనే తుంగలో తొక్కుతారా?

**మహారాష్ట్ర స్పీకర్‌పై సుప్రీంకోర్టు అసహనం**

న్యూఢిల్లీ : మహారాష్ట్ర సీఎం, మరికొందరు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ దాఖలైన పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడంలో ఆ రాష్ట్ర శాసనసభ స్పీకర్ జాప్యం చేస్తుండటంపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలను తుంగలో తొక్కకూడదని స్పీకర్‌కు సలహా ఇవ్వండని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు చెప్పింది. అనర్హతపై ఎప్పటిలోగా తేల్చుతారో స్పీకర్ చెప్పాలని, లేదంటే రెండు నెలల గడువు విధిస్తామని చెప్పింది. శివసేనను చీల్చిన షిండే వర్గం ఎమ్మెల్యేలపై ఉద్ధవ్ వర్గం దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకునే ప్రక్రియను వివరించాలని సుప్రీంకోర్టు సెప్టెంబరు 18న స్పీకర్‌ను ఆదేశించింది.

# ఫీల్డ్ వర్క్ ఆపేయండి

- కాగ్ అధికారులకు మౌఖిక ఆదేశాలు
- రాతపూర్వక ఉత్తర్వులు ఇవ్వాల్సిందే
- కేంద్రానికి తేల్చిచెప్పిన అధికారులు
- మోదీ సర్కారు అవినీతిని బయటపెట్టిన కాగ్ అధికారులపై ఇటీవలే బదిలీవేటు



న్యూఢిల్లీ, అక్టోబర్ 13: దేశ ఆర్థిక నిఘా సంస్థ కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్)లో తీవ్ర గందరగోళం నెలకొన్నది. వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల ఆడిటింగ్‌కు కీలకమైన ఫీల్డ్‌వర్క్‌ను వెంటనే ఆపేయాలంటూ కాగ్ అధికారులకు ఈ నెల మొదటి వారంలో 'మౌఖిక ఆదేశాలు' జారీ కావడమే ఈ పరిస్థితికి కారణం. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్టుతోపాటు ఆయుష్మాన్ భారత్, భారత్‌మాల పథకాల్లో జరిగిన అవినీతిని బట్టబయలు చేసిన ముగ్గురు సీనియర్ ఐఏఎస్‌లను కేంద్రం ఇటీవలే బదిలీ వేటు వేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాజా ఆదేశాలు జారీ కావడం గమనార్హం. దీనిపై 'వైర్'లో సమగ్ర వార్తాకథనం రావడంతో బీజేపీ సర్కారుపై కాంగ్రెస్, ఆప్, తృణమూల్ కాంగ్రెస్ తదితర విపక్షాలు నిప్పులు చెరుగుతున్నాయి.

**ఫీల్డ్ వర్క్ కీలకం..**

మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ విభాగాల ఆడిటింగ్‌కు ఫీల్డ్ వర్క్ ఎంతో కీలకం. దీని ద్వారా కాగ్ అందించే నివేదికలు ప్రభుత్వ ఖర్చుల తోపాటు ఆర్థిక అంశాల్లో జవాబుదారీతనం పెంపునకు ఉపకరిస్తాయి. ఈ నివేదికల రూపకల్పన కోసం కాగ్ సిబ్బందిలో 30 నుంచి 40 శాతం మంది సిబ్బంది క్షేత్రస్థాయిలో పని చేస్తుంటారు. అయితే రాతపూర్వక ఆదేశాలు వచ్చిన తర్వాత మాత్రమే ఫీల్డ్‌వర్క్‌ను ఆపాల్సిందిగా క్షేత్రస్థాయి సిబ్బందికి సూచిస్తామని కాగ్ కార్యాలయ అధికారులు స్పష్టం చేసినట్టు తెలుస్తున్నది. కేవలం మౌఖిక ఆదేశాలను అనుసరించి ఫీల్డ్‌వర్క్‌ను ఆపాల్సిందిగా క్షేత్రస్థాయి సిబ్బందికి సూచిస్తే భవిష్యత్తులో తాము విచారణను లేదా చట్టపరమైన చర్యలను ఎదుర్కొవాల్సి వస్తుందని, తర్వాత వచ్చే ప్రభుత్వాలతోపాటు ప్రస్తుత ప్రభుత్వం సైతం తమను వివాదాల్లోకి లాగవచ్చని ఆ అధికారులు భయపడుతున్నట్టు సమాచారం.




**కొత్త నివేదికలపై సంతకం చేయని కాగ్**

మరోవైపు తాను కొత్తగా ఎలాంటి నివేదికలపై సంతకాలు చేయడం లేదని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ గిరీశ్ చంద్ర ముర్ము స్పష్టం చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇండియన్ ఆడిట్ అండ్ అకౌంట్స్ సర్వీస్ (ఐఏఅండ్ఏఎస్) ఇంచార్జి ఆఫీసర్ కూడా సంతకాలు చేయాల్సిన ఈ నివేదికలపై జీసీ ముర్ము సంతకం లేకపోతే వాటిని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు వీలుండదు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీతోపాటు కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు అత్యంత నమ్మకస్తుడిగా పేరున్న జీసీ ముర్ము గుజరాత్ క్యాడర్‌కు చెందిన 1985 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. 2020లో కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియాగా నియమితులయ్యారు. అంతకుముందు ఆయన జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా పనిచేశారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్ముకశ్మీర్‌కు ఆయనే తొలి లెఫ్టినెంట్ గవర్నర్.

## యూపీలో బస్సు సౌకర్యం లేని గ్రామాలు 4793

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్(నమస్తే తెలంగాణ): బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లో ప్రజా రవాణా వ్యవస్థ దారుణంగా ఉన్నది. దాదాపు 4,793 గ్రామాలకు ఇప్పటికీ బస్సు సౌకర్యం లేదు. ఈ గ్రామాల ప్రజలు ఎటైనా వెళ్లాలంటే ఆటోలో లేదా బైక్‌పై పోవాల్సిందే. అయితే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుండటం, లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో యోగి సర్కార్ దిద్దుబాటు చర్యలకు దిగింది. ఎన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించవచ్చో సర్వే చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. దీంతో అధికారులు గ్రామాల బాట పట్టారు.

## కిడ్నీలు అమ్మితేనే అప్పులు తీరుతాయ్

- మహారాష్ట్ర డబుల్ ఇంజిన్ సర్కార్ పాలనలో వ్యవసాయం దయనీయం
- కిడ్నీలు అమ్ముతామంటూ నాందేడ్ కలెక్టరేట్ వద్ద పోస్టర్

ముంబై(నమస్తే తెలంగాణ): బీజేపీ పాలిత రాష్ర్టాల్లో రైతుల పరిస్థితి అత్యంత అధ్వానంగా మారింది. మహారాష్ట్రలోని డబుల్ ఇంజిన్ సర్కార్ పాలనలో అప్పులు తీర్చేందుకు రైతులు కిడ్నీలు అమ్ముకునేందుకు సిద్ధమవుతున్నారు. నాందేడ్ జిల్లాలోని కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద కిడ్నీలు అమ్ముతామంటూ పోస్టర్లు అంటించడం కలకలం రేపింది. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు తమ కిడ్నీలు అమ్మేందుకు సిద్ధపడటమే ఆ రాష్ట్రంలోని రైతుల దయనీయ పరిస్థితికి అద్దం పడుతున్నది. జిల్లాకు చెందిన ఓ వ్యవసాయ కుటుంబం అప్పుల ఊబిలో కూరుకుపోయింది. దీంతో ఒకే కుటుంబంలోని తండ్రి, పెద్ద కుమారుడు, రెండో కుమారుడు కూడా బలవన్మరణానికి పాల్పడ్డారు. వడ్డీ వ్యాపారుల వద్ద నుంచి తీసుకున్న రెండు లక్షల రూపాయల అప్పు తీర్చే దారిలేకపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు కిడ్నీలు అమ్మేందుకు సిద్ధమయ్యారు.

**వడ్డీ వ్యాపారుల బెదిరింపులు...**

నాందేడ్ జిల్లా సిల్లోడ్ తాలుకా పింపల్‌గావ్ పేట్‌కు చెందిన యువ రైతు సోమనాథ్ పండిత్ బోసలే (30) అప్పుల పాలై గురువారం రాత్రి తన పొలంలోని చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. 15 ఏండ్ల క్రితం సోమనాథ్ తండ్రి పండిత్ మాణిక్ రావు బోసలే, 2019లో సోమనాథ్ పెద్దన్న గజానన్ మాణిక్ రావు బోసలే బలవన్మరణానికి పాల్పడ్డారు. తండ్రి, పెద్దన్నల ఆత్మహత్యల తర్వాత కుటుంబ భారం సోమనాథ్‌పై పడటంతో పాటు అప్పులు కొండలా పెరిగిపోవడంతో సోమనాథ్ పండిత్ బోసలే ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు కిడ్నీలు అమ్మేందుకు సిద్ధమయ్యారు.

## ఎన్నికల కమిషనర్ల స్థాయిని తగ్గించడమా?

**కొత్త బిల్లుపై మాజీ సీఈసీ ఖురేషి అసంతృప్తి**

న్యూఢిల్లీ: ఇటీవల రాజ్యసభలో ప్రవేశపెట్టిన ఎలక్షన్ కమిషనర్ల నియామకం, నిబంధనల బిల్లుపై మాజీ ఎన్నికల ప్రధాన కమిషనర్ ఎస్వై ఖురేషి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషనర్లకు ఇప్పటివరకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి స్థాయి హోదా ఉండేదని, దాన్ని క్యాబినెట్ సెక్రటరీ స్థాయికి తగ్గించేలా బిల్లులో పేర్కొనడం బాధాకరమని చెప్పారు. ఇప్పటివరకు ఎవరినైనా ఎన్నికల కమిషనర్‌గా నియమించే అవకాశముండేదని గుర్తుచేశారు. సెక్రటరీ స్థాయి అధికారులు లేదా ఆ హోదాతో సమాన హోదా కలిగిన వ్యక్తులనే ఎన్నికల కమిషనర్‌గా నియమించాలంటూ బిల్లులో ప్రతిపాదించడం ఆహ్వానించదగ్గ పరిణామమని వెల్లడించారు.

## ఇంటి ముందు నీళ్లు చల్లొద్దన్నందుకు దళితుడి హత్య

**డబుల్ ట్రబుల్ ఇంజిన్**

లక్నో, అక్టోబర్ 13: ఇంటి ముందు నీళ్లు చల్లొందన్నందుకు పొరుగింటి వ్యక్తి ఒక దళితుడిని తుపాకీతో కాల్చి చంపిన దారుణ ఘటన బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లోని కౌశాంబి జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం రమ్నేవాజ్ రాయ్‌దాస్(35) స్థానిక మార్కెట్లో కూలీగా పని చేసేవాడు. అతడి ఇంటి పక్కన ఉండే రాహుల్ కుమార్ బుధవారం రాత్రి రాయ్‌దాస్ ఇంటి ముందు నీళ్లు చల్లాడు. తమ ఇంటి ముందు నీళ్లెందుకు చల్లారని రాయ్‌దాస్ రాహుల్ కుటుంబాన్ని ప్రశ్నించాడు. ఈ విషయమై మాట మాట పెరగడంతో కోపం వచ్చిన రాహుల్ కుమార్ తుపాకీతో రాయ్‌దాస్‌ను కాల్చడంతో అతడు అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటనలో మృతుడి కుటుంబానికి చెందిన ఇద్దరు మహిళలు కూడా గాయపడ్డారు. నిందితుడు పరారీలో ఉన్నాడు.

## నిజాం కాలం నాటి రిజర్వేషన్లు అమలు చేయాలి: బీఆర్ఎస్

ముంబై, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): మరాఠాలకు నిజాం కాలం నాటి రిజర్వేషన్లు కల్పించాలని మహారాష్ట్ర బీఆర్ఎస్ ఉత్తర ముంబై లోక్‌సభ సమన్వయకర్త రవీంద్ర రోకడే డిమాండ్ చేశారు. శుక్రవారం బీఆర్ఎస్ ముంబై కొంకణ విభాగం ఆధ్వర్యంలో వివిధ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బాంద్రా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రోకడే మాట్లాడుతూ.. స్థానికంగా ఉన్న పరిశ్రమలను ప్రైవేటీకరణ పేరుతో ప్రభుత్వాలు తమవారికి కాంట్రాక్టులు అప్పగిస్తున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ ముంబై సబర్బన్ జిల్లా సమన్వయ కర్త సంజయ్ నింబాల్కర్, బాంద్రా తూర్పు సమన్వయకర్త సందీప్ కొమురెల్లి, బాంద్రా పశ్చిమ సమన్వయకర్త సాగర్ పవార్, గౌరవ్ వరమ్ పాల్గొన్నారు.

## ఈఏడీ కార్డుల చెల్లుబాటు ఐదేండ్లు : అమెరికా భారతీయులకు లబ్ధి

న్యూయార్క్: అమెరికాలోని భారతీయులకు అమెరికా శుభవార్త చెప్పింది. ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ కార్డులను ఐదేండ్ల కాలపరిమితికి జారీ చేయనున్నట్టు యూఎస్ సిటిజెన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) వెల్లడించింది. ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్ కింద నూతనంగా దరఖాస్తు చేసుకున్న వారు, రెన్యువల్ కోసం అప్లికేషన్ చేసుకున్నవారికి (ఐ–765) దీని ద్వారా లబ్ధి చేకూరనున్నది. ఇప్పటివరకు ఈఏడీ కార్డులను ఒకటి, రెండేండ్లకు మాత్రమే జారీ చేసేవారు.

## ఉప్పుడు బియ్యంపై ఎగుమతి సుంకం పొడిగింపు

న్యూఢిల్లీ : ఉప్పుడు బియ్యంపై 20 శాతం ఎగుమతి సుంకం వసూలు గడువును కేంద్ర ప్రభుత్వం వచ్చే ఏడాది మార్చి 31 వరకు పొడిగించింది. దేశంలో తగినన్ని నిల్వలు ఉండటంతోపాటు ధరలు అదుపులో ఉండాలన్న లక్ష్యంతో ఆగస్టు 25న దీనిని విధించింది. ఈ గడువు ఈ నెల 16తో ముగియబోతున్నది. బాస్మతియేతర బియ్యం రకాలన్నిటిపైనా ప్రభుత్వం ఆంక్షలు విధించింది.

# రాజస్థాన్ బీజేపీలో అసమ్మతి

**అభ్యర్థుల ఎంపికపై క్యాడర్ అసంతృప్తి**



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్(నమస్తే తెలంగాణ): రాజస్థాన్ శాసనసభ ఎన్నికలకు సంబంధించి 41 మంది అభ్యర్థుల పేర్లతో బీజేపీ ఇటీవల తొలి జాబితా విడుదల చేసింది. ఇందులో ఏడుగురు ఎంపీలకు టికెట్లిచ్చింది. రాష్ట్రంలో 200 అసెంబ్లీ స్థానాలు, 25 లోక్‌సభ స్థానాలున్నాయి. అంటే ఒక్కో పార్లమెంట్ నియోజక వర్గ పరిధిలో సగటున 8 అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయి. ఆ లెక్కన టికెట్లు పొందిన ఏడుగురు ఎంపీలు వారి లోక్‌సభ స్థానాల పరిధిలోని 56 అసెంబ్లీ స్థానాలను ప్రభావితం చేస్తారని, దాంతో గెలుపు సునాయాసమవుతుందని అధిష్ఠానం భావిస్తున్నది. అయితే టికెట్ లభించని సిట్టింగ్ ఎమ్మెల్యేలతో పాటు టికెట్ ఆశించి భంగపడ్డ నాయకులూ అధిష్ఠానంపై అసంతృప్తి వెళ్లగక్కుతున్నారు. అందులో కొందరు తాము స్వతంత్రంగా పోటీ చేస్తామని తిరుగుబావుటా ఎగరేశారు. విద్యాధర్ నగర్ నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నర్పత్ సింగ్ రజ్వీని కాదని ఎంపీ దియా కుమారికి టికెట్ ఇవ్వడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నది. సిట్టింగ్ ఎమ్మెల్యే మాజీ ఉప రాష్ట్రపతి బైరాన్ సింగ్ షెకావత్ అల్లుడు కావడం రాజకీయంగా ప్రాముఖ్యం సంతరించుకుంది. తనను కాదని ఎంపీకి టికెట్ ఎలా ఇస్తారని రజ్వీ బహిరంగంగానే అధిష్ఠానాన్ని నిలదీశారు. తిజారా సిట్టింగ్ ఎమ్మెల్యే తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. మరోచోట తన తండ్రి జయరామ్ జాటవ్‌కు టికెట్ ఇస్తే మరో తిరుగుబాటు నేతను గెలిపిస్తానని అతని కుమార్తె ప్రకటించింది. సాంచోర్ టికెట్ పొందిన మరో ఎంపీ దేవీ పటేల్ సొంత గ్రామంలో పూజలు చేయడానికి వెళ్లగా అతడిపై రాళ్ల దాడి జరిగింది. టికెట్ ఆశించి భంగపడ్డ దానారాం చౌదరి వర్గీయులు ఈ దాడి చేసి ఉంటారని భావిస్తున్నారు. అయితే పార్టీలో అసంతృప్తులపై చర్యలు తీసుకుంటామని అధిష్ఠానం సంకేతాలిస్తున్నది. ఈ మేరకు ఇప్పటికే 11 మందిని 6 ఏండ్ల పాటు పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. అయినా టికెట్ దక్కని నాయకుల్లో అసంతృప్తి చల్లారడం లేదు. ఎన్నికల వేళ సీఎం అభ్యర్థిని ప్రకటించకపోవడం అసంతృప్తికి దారి తీసింది.



**వసుంధర వర్గం అసంతృప్తి**

రాజస్థాన్ మాజీ సీఎం, మాజీ కేంద్ర మంత్రి వసుంధర రాజే బీజేపీలో బలమైన నేత. అయితే ఆమెకు ప్రధాని మోదీతో సత్సంబంధాలు లేవని రాజకీయ వర్గాల భోగట్టా. ఈ ఎన్నికల్లో ఆమె వర్గీయులకు టికెట్లు ఇవ్వకుండా ఆమెను రాజకీయంగా తొక్కేస్తున్నారని ఆరోపణలున్నాయి. ఆమెను రాజకీయంగా దెబ్బ తీయడానికే మోదీ వ్యూహాత్మకంగా సిట్టింగ్ ఎంపీలను అసెంబ్లీ బరిలోకి దించారని భావిస్తున్నారు.




## అభ్యర్థుల ప్రకటనలో కాంగ్రెస్ మల్లగుల్లాలు

**తెలంగాణతో పాటు మధ్యప్రదేశ్‌లోనూ ఇదే పరిస్థితి**



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): కేంద్ర ఎన్నికల సంఘం అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ఇప్పటికే ప్రకటించినా కాంగ్రెస్ పార్టీ మాత్రం ఇంకా అభ్యర్థుల ప్రకటనపై మల్లగుల్లాలు పడుతున్నది. తెలంగాణలోనే కాదు.. మధ్యప్రదేశ్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది. పితృపక్షాల తర్వాత తొలి లిస్టును విడుదల చేస్తామని మధ్యప్రదేశ్ కాంగ్రెస్ నేత కమల్‌నాథ్ ప్రకటించినప్పటికీ అసలు విషయం వేరే ఉన్నదన్న వార్తలు వెలువడుతున్నాయి. ముఖ్యంగా అభ్యర్థుల ఎంపికలో కాంగ్రెస్ ఓ నిర్ణయానికి రాలేకపోతున్నట్టు సమాచారం. టికెట్ రానివాళ్లు పార్టీ మారే అవకాశాలుంటాయని, ఇలాంటి వాళ్లను బుజ్జగించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధిష్ఠానం నుంచి ఆదేశాలు జారీ అయినట్టు తెలుస్తున్నది. కాగా, ఇప్పటికే తెలంగాణలో అధికార బీఆర్ఎస్ ఒకే దఫాలో అభ్యర్థులను ప్రకటించడమే కాకుండా ప్రచారంలో దూసుకుపోతున్న విషయం తెలిసిందే.

## తొలిసారి సొంతూళ్లో ఓటు

**బస్తర్ రీజియన్‌లోని మారుమూల గ్రామాల్లో పోలింగ్ స్టేషన్లు**

రాయ్‌పూర్, అక్టోబర్ 13: ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ రీజియన్ అంటేనే మావోయిస్టుల అడ్డా అని పేరున్నది. ఈ ప్రాంత ప్రజలు ఎన్నికల్లో ఓటు వేయాలంటే నానా తిప్పలు పడేవాళ్లు. కనీసం 10 కిలోమీటర్లు నడిచి వెళ్లి ఓటేసే పరిస్థితి ఉండేది. కానీ స్వతంత్ర భారతదేశంలో తొలిసారిగా బస్తర్ రీజియన్‌లోని 120కిపైగా గ్రామాల్లో పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ 120కిపైగా గ్రామాలు దాదాపు అడవిని ఆనుకొని ఉంటాయి. త్వరలో జరుగనున్న ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆయా గ్రామాల ప్రజలు తమ ఊరిలోనే ఓటు వేయవచ్చు.

## నాసా సైకి ఆస్టరాయిడ్ మిషన్ సక్సెస్

న్యూయార్క్, అక్టోబర్ 13: లోహ గ్రహశకలంపై పరిశోధనలు చేసేందుకు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా) చేపట్టిన సైకి మిషన్ విజయవంతమైంది. కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి స్పేస్ ఎక్స్ శుక్రవారం ఈ ప్రయోగాన్ని చేపట్టింది. నింగిలోకి దూసుకెళ్లిన రాకెట్ స్పేస్‌క్రాఫ్ట్‌ను నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. సైకి స్పేస్‌క్రాఫ్ట్ ఆరేండ్ల పాటు ప్రయాణించి భూమి నుంచి 3.6 బిలియన్ల కిలోమీటర్ల దూరంలోని కక్ష్యలోకి చేరుకోనున్నది. సాధారణంగా గ్రహశకలాలు రాతి లేదా మంచుతో ఉంటాయి. అయితే అంగారకుడు, బృహస్పతి గ్రహాల మధ్యనున్న ఈ గ్రహశకలం లోహాలతో నిండి ఉంది. దీనిపై పరిశోధనల ద్వారా భూమి పుట్టుక, జీవం గురించి తెలుసుకునే అవకాశం ఉందని నాసా భావిస్తున్నది.

## పూరీ జగన్నాథ ఆలయంలో డ్రెస్ కోడ్

భువనేశ్వర్: పూరీలోని శ్రీ జగన్నాథుని ఆలయంలో మెరుగైన ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఏర్పరచడం కోసం హుందాగా కనిపించే దుస్తులను ధరించాలని భక్తులను శ్రీ జగన్నాథ్ దేవాలయ పాలక మండలి కోరింది. పురుషులు ప్యాంట్, చొక్కా, చుడీదార్–పంజాబీ, ధోతీ, పంచె వంటివాటిని ధరించవచ్చునని, స్త్రీలు చీర, సల్వార్ కమీజ్ వంటివాటిని ధరించవచ్చునని తెలిపింది.

# గాజా ఆక్రమణ!

- ఇజ్రాయెల్ సైన్యం గ్రౌండ్ ఆపరేషన్
- గాజాలోకి అడుగుపెట్టిన బలగాలు
- హమాస్ మిలిటెంట్ల ఏరివేత, బందీల ఆచూకీ కోసం ఆపరేషన్
- 24 గంటల్లో ఉత్తర గాజాను వీడాలని స్థానిక పౌరులకు ఆదేశాలు
- గాజాపై దాడులు కొనసాగిస్తే యుద్ధం మరింత విస్తరిస్తుంది.. ఇరాన్ వ్యాఖ్యలు



జెరూసలేం, అక్టోబర్ 13: ఇజ్రాయెల్–హమాస్ మధ్య యుద్ధంలో శుక్రవారం కీలక పరిణామం చోటుచేసుకొన్నది. హమాస్ మిలిటెంట్ గ్రూపును సమూలంగా మట్టుపెట్టే ప్లాన్‌లో భాగంగా ఇజ్రాయెల్ 'గ్రౌండ్ ఆపరేషన్' ప్రారంభించినట్టు తెలుస్తున్నది. గాజా భూభాగంలోకి తమ బలగాలు, యుద్ధ ట్యాంకులు ప్రవేశించినట్టు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) శుక్రవారం ప్రకటించింది. ఉగ్రవాదులను మట్టుపెట్టడంతోపాటు ఇజ్రాయెల్ నుంచి బందీలుగా తీసుకెళ్లిన వారి ఆచూకీ కోసం గత 24 గంటలుగా 'స్థానిక ఆపరేషన్' ప్రారంభించినట్టు తెలిపింది. పలు టెర్రరిస్టులను తమ బలగాలు విజయవంతంగా హతమార్చాయని, బందీల ఆచూకీకి సంబంధించి సమాచారం సేకరించాయని పేర్కొన్నది. అయితే ఇజ్రాయెల్ బలగాలు గాజా భూభాగం పూర్తి లోపలికి ఇంకా వెళ్లలేదని 'చానెల్ 12' నివేదించింది. మరోవైపు హమాస్ మిలిటెంట్లను పూర్తిగా ఏరివేసే ప్రక్రియ చేపట్టేందుకు ఇజ్రాయెల్ సైన్యం మరో కీలక నిర్ణయం తీసుకొన్నది. ఉత్తర గాజా రీజియన్‌లో ఉంటున్న దాదాపు 11 లక్షల మంది పాలస్తీనియన్ పౌరులు 24 గంటల్లో వెంటనే ఆ ప్రాంతాన్ని వీడి, దక్షిణ గాజాలోకి వెళ్లిపోవాలని శుక్రవారం ఆదేశాలు జారీచేసింది. గాజా సిటీకి కూడా ఈ ఆదేశాలు వర్తిస్తాయి. ఉత్తర గాజాలో అక్కడ పౌరుల మధ్య ఉంటూ కార్యకలాపాలను నడుపుతున్న హమాస్ మిలిటెంట్లను ఒక్కొక్కరిగా అంతమొందించే చర్యలో భాగంగా ఈ ఆదేశాలు వెలువడినట్టు పలు మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే ఒక్కసారిగా ఇంత పెద్ద సంఖ్యలో జనాభాను వారు ఉంటున్న ప్రాంతాన్ని వీడాలని ఆదేశాలు ఇవ్వడంపై ఐక్యరాజ్యసమితి అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ పరిణామాలు మానవతా సంక్షోభాన్ని సృష్టిస్తాయని అభిప్రాయపడింది. ఇజ్రాయెల్ అటువంటి ఆదేశాలను వెనక్కు తీసుకోవాలని ఐరాస అధికార ప్రతినిధి స్టెఫాన్ డుజారిన్ అన్నారు.

**గాజాపై దాడులు ఆపకుంటే.**

గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ దాడులు వెంటనే ఆపకుంటే, ఈ యుద్ధం మధ్య ప్రాచ్యంలోని ఇతర ప్రాంతాలకు కూడా విస్తరిస్తుందని ఇరాన్ హెచ్చరించింది. మరోవైపు, ఇజ్రాయెల్ సైన్యం చేపట్టిన ఒక డేరింగ్ ఆపరేషన్‌కు సంబంధించిన వీడియోను ఐడీఎఫ్ శుక్రవారం విడుదల చేసింది. గాజా సరిహద్దు సమీపంలో చేపట్టిన ఆపరేషన్‌లో సైనికులు అత్యంత ధైర్యసాహసాలతో హమాస్ చెర నుంచి 250 మంది బందీలను కాపాడారు.



గాజా వైపునకు దూసుకెళ్తున్న ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకులు

## ఢిల్లీ చేరిన మొదటి విమానం

యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ అజయ్‌లో భాగంగా ఇజ్రాయెల్ నుంచి విద్యార్థులు సహా దాదాపు 200 మంది భారతీయులతో కూడిన తొలి విమానం శుక్రవారం ఉదయం ఢిల్లీ చేరింది. బాంబు దాడులు, సైరన్ల హెచ్చరికలతో భయానక పరిస్థితులు నెలకొన్నాయని, ఈ యుద్ధం ఎంత వరకు వెళ్తుందో తెలియడం లేదని మొదటి బ్యాచ్‌లో భాగంగా ఇజ్రాయెల్ నుంచి వచ్చిన శశ్వాత్ సింగ్ పేర్కొన్నారు.